క్లుప్తంగా

క్రీడాకారులకు కలెక్టర్ అభినందన

కాకినాడ సిటీ: విజయవాడ క్లబ్‌లో ఫిబ్రవరి 21 నుంచి 23వ తేదీ వరకు జరిగిన ఏపీ మాస్టర్స్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో విశేష ప్రతిభ కనబర్చిన జిల్లా క్రీడాకారులు శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని అభినందించారు. మార్చి 16 నుంచి 23వ తేదీ వరకు గోవాలో జరిగే మాస్టర్స్ జాతీయ పోటీల్లో ఉత్తమ ప్రదర్శన ఇచ్చి కాకినాడ జిల్లాకు పేరు తీసుకురావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో కర్రి భామిరెడ్డి, వి. శారదాదేవి, చంద్రు గోవిందరాజు, బి.కృష్ణమూర్తి, డీఏఎస్ ప్రసాద్‌వర్మ, వై సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'నన్నయ' ప్రిన్సిపాల్ కమల కుమారికి ఘనంగా వీడ్కోలు



సహచర అధ్యాపకులతో ప్రొఫెసర్ కమలకుమారి

కాకినాడ రూరల్: స్థానిక అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటరు ప్రిన్సిపాల్‌గా సేవలందించి వర్సిటీ ప్రధాన క్యాంపస్‌కు బదిలీ అయిన ప్రొఫెసర్ కమలకుమారికి సహచర అధ్యాపకులు శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా కమల కుమారి మాట్లాడుతూ పీజీ సెంటరులో ప్రిన్సిపాల్ పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని, ఇక్కడి సిబ్బంది సహాయ సహకారాలు మరవలేనన్నారు. కార్యక్రమంలో నూతన ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.ప్రశాంత శ్రీ, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ పోచయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాల్యానికి భరోసా ఏదీ?

- పంచాయతీల్లో కనిపించని వివాహ నమోదు ప్రక్రియ
- కార్యదర్శులకు, ప్రజలకు కొరవడిన అవగాహన
- చట్టం అమలైతేనే బాల్య వివాహాలకు అడ్డుకట్ట



కాకినాడ సిటీ: అడుగడుగునా నిర్లక్ష్యం.. అంతులేని జాప్యంతో చట్టం తన పని తాను చేసుకోవడం లేదు. గ్రామాల్లో బాల్య వివాహాలను అరికట్టాలని మొత్తుకుంటున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. గ్రామ పంచాయతీల్లో వివాహ నమోదు తప్పనిసరని ప్రభుత్వం చెబుతున్నా ఎక్కడా అమలు కావడం లేదు. దీంతో నేటికీ అక్కడక్కడ బాల్య వివాహాలు జరుగుతూనే ఉన్నాయి. వివాహ నమోదు తప్పని సరి చేయాలని 2002లో చట్టం చేశారు. జీవో–193 ప్రకారం ప్రతి గ్రామంలో కార్యదర్శులు వివాహాలను నమోదు చేయాలని చట్టం రూపొందించారు. వివాహ రిజిస్ట్రేషన్ చట్టంలో కుల, మతాల ప్రాతిపదికన కొన్ని మినహాయింపులు ఉండగా 2012 క్యాబినేట్ తీసుకున్న నిర్ణయంతో అన్ని మతాల వారికి ఈ చట్టాన్ని వర్తింపజేశారు.

అవగాహన లోపం

వివాహ రిజిస్ట్రేషన్ నమోదుపై కార్యదర్శులకు అంతగా అవగాహన లేక పోవడంతో గ్రామాల్లో ప్రజలకు చెప్పడంతో విఫలమయ్యారని చెప్పవచ్చు. కేవలం జనన, మరణ ధ్రువీకరణ పత్రాలపై తప్ప వీటిపై అవగాహన అంతగా లేదంటున్నారు. వివాహాలకు ఆడ పిల్లలకు 18, మగ పిల్లలకు 21 ఏళ్ల తప్పనిసరి అని గ్రామాల్లోని అవగాహన కల్పించాల్సి ఉంది.

పంచాయతీల్లో నమోదు

వివాహం జరిగిన పంచాయతీల్లోనే కార్యదర్శులకు ముందుగా దరఖాస్తు చేసుకోవాలి. జనన, మరణ ధ్రువపత్రాల మాదిరిగానే వివాహ రిజిస్ట్రేషన్ నమోదు పత్రాలు పొందొచ్చు. వివాహం జరిగిన 30 రోజుల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. 30 రోజుల తర్వాత కూడా రోజుకు వంద రూపాయలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

చాటుగా బాల్య వివాహాలు

కాకినాడ సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో అక్కడక్కడ బాల్య వివాహాలు జరుగుతూనే ఉన్నాయి. ఆర్థిక సమస్యలు, అవగాహన లోపంతోనే ఇవి సాగిపోతున్నాయి. ప్రజల్లో పూర్తిగా చైతన్యం లోపించింది. ఎంతో భవిష్యత్ ఉన్న జీవితాలు బాల్య వివాహాలతో చీకటిమయమవుతున్నాయి. అంగన్‌వాడీ కార్యకర్తలు కొంతవరకు బాల్య వివాహాలను అడ్డుకుంటున్నా అక్కడక్కడా జరిగిపోతూనే ఉన్నాయి.

పట్టించుకోని అధికారులు

వివాహం చేసుకునే ముందే రిజిస్ట్రేషన్ చేసుకోవాలనే నిబంధనలను అధికారులు అమలు చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదు చేస్తే తప్ప ఐసీడీఎస్ అధికారులు గ్రామాల వైపు కన్నెత్తి చూడటం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో వీటిపై పంచాయతీ వారు, ఐసీడీఎస్ అధికారులు సంయుక్తంగా అవగాహన కల్పించి బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాల్సి ఉంది.

అవగాహన కల్పించాలి



బాల్య వివాహాలపై సంబంధిత శాఖ అధికారులు అవగాహన కల్పించాలి. పాఠశాలల్లో, కళాశాలల్లో, తల్లిదండ్రులకు ఇలా ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరి. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లేకపోవడంతో పదో తరగతి పాసైన వెంటనే బాల్య వివాహాలు చేస్తున్నారు. వివాహాలు చేసే వారు తప్పని సరిగా పంచాయతీల్లో (సచివాలయాల్లో) నమోదు చేయాలనే నిబంధనలు కఠినతరం చేస్తే బాల్య వివాహాలు అరికట్టవచ్చు.

కాకిలేటి రవీంద్ర, జిల్లా మాల మహానాడు నాయకుడు, కాకినాడ

షార్ట్ సర్క్యూట్‌తో హెచ్‌టీ కేబుల్‌కు మంటలు



హెచ్‌టీ కేబుల్ నుంచి వస్తున్న మంటలు

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్ వద్ద తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న అండర్ గ్రౌండ్ హెచ్‌టీ కేబుల్‌కు అగ్ని ప్రమాదం వాటిల్లింది. హెచ్‌టీ కేబుల్ లైన్‌కు సంబంధి విద్యుత్ స్తంభం వద్ద ఫ్యూజ్ బాక్స్ నుంచి శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడంతో విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తయ్యారు. సాలిపేట అగ్ని మాపక సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. ప్రమాదంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడంతో ప్రత్యామ్నాయంగా సరఫరా ఏర్పాట్లు చేశామని కాకినాడ డిస్ట్రిబ్యూషన్ – 4 సెక్షన్ ఏఈ గౌతు రాజు తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కరప: మండలం వేళంగిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నుంచి జరిగే ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు చీఫ్ సూపరింటెండెంట్ ఆచంట అంజిబాబు తెలిపారు. వేళంగిలో శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 86 మంది, ద్వితీయ సంవత్సరంలో 64 మంది పరీక్షలు రాస్తున్నారన్నారు. వీరితో పాటు కరప హైస్కూలు నుంచి 58 మంది, పీఎస్ఎన్ మూర్తి కళాశాల నుంచి 13 మంది పరీక్షలు రాస్తున్నారన్నారు. శనివారం ప్రథమ, సోమవారం ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు రాస్తారన్నారు. కరప పోలీసు స్టేషన్‌లో పరీక్షా పేపర్లను భద్రపరచినట్టు తెలిపారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్టు అంజిబాబు వివరించారు. డీఓగా జెస్సీ డ్యానియల్‌ను నియమించినట్లు ఆయన చెప్పారు.

రొయ్యల చెరువులు తొలగించండి

- అనధికార తవ్వకాలకు నిరసనగా రైతుల ధర్నా
- 110 మంది సంతకాలతో తహసీల్దార్‌కు ఫిర్యాదు



కరపలో అనధికారికంగా తవ్విన చెరువు

కరప: గ్రామంలో అనుమతి లేని రొయ్యల చెరువుల తవ్వకాన్ని నిరసిస్తూ రైతులు ధర్నా చేశారు. స్థానిక రైతులంతా శుక్రవారం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ధర్నా చేసి రొయ్యల చెరువుల సాగును నిలిపివేయాలని, పంటభూములను కాపాడాలని, న్యాయం చేయాలంటూ రైతులు నినాదాలు చేశారు. నీటి సంఘం డైరెక్టర్లు సీహెచ్ గోవిందరాజులు, ఎస్.సూర్యనారాయణ, రైతులు చిన్నారి శ్రీనివాస్, అనిశెట్టి సత్తిబాబు, రెడ్డి చంద్రరావు, పేకేటి సూరన్న, చిన్నారి వీరభద్రరావు తదితరులు మాట్లాడుతూ 2022లో స్థానికంగా 10 ఎకరాలను లీజుకు తీసుకుని అక్రమంగా రొయ్యల చెరువులు తవ్వగా రైతుల ప్రతిఘటనతో నిలిపివేశారన్నారు. మళ్లీ ఇప్పుడు కొందరు ఆ చెరువులను లీజుకు తీసుకుని రొయ్యల సాగుకు నీరు తోడుతున్నారని, అదేమని ప్రశ్నిస్తే రుబాబు చేస్తూ ఎవరికి చెప్పుకొంటారో చెప్పుకోండని అంటున్నారని వివరించారు. ఈ చెరువుల వల్ల పరిసర ప్రాంతాల్లోని పొలాలు చౌడుదేరి, పంటలు పండకుండా పోతాయన్నారు. రొయ్యల చెరువుల వ్యర్థాలతో రావువారి కాలువ, తనేలు కాలువ, కొత్తకాలువ, గట్లచేను కాలువ తదితర పంట కాలువలు దెబ్బతిని సాగునీరు కలుషితమవుతుందన్నారు. మురుగు కాలువలు పూడుకుపోయి అరట్లకట్ట, గొడ్డటిపాలెం, జెడ్.భావారం, కొరిపల్లి, కరప గ్రామాలకు సంబంధించి 3 వేల ఎకరాల్లోని మురుగునీరు, తుపాన్లు, అధికవర్షాలకు ముంపు నీరు దిగక పంటపొలాలు మునిగిపోయే ప్రమాద ముందని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. రెవెన్యూ, ఇరిగేషన్, డ్రైనేజీ శాఖల అధికారులు స్పందించి అక్రమంగా చేపట్టిన రొయ్యల చెరువుల సాగును నిలిపివేసి, తమకు రక్షణ కల్పించాలని వారు కోరారు. అనంతరం 110 రైతుల సంతకాలతో కూడిన ఫిర్యాదును తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ డి.దుర్గాప్రసాద్‌కు అందజేశారు. కలెక్టర్ కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేస్తామని వారు వివరించారు.



తహసీల్దార్ కార్యాలయంలో డీటీ దుర్గాప్రసాద్‌కు ఫిర్యాదు ప్రతిని అందజేస్తున్న రైతులు

టైలర్లను ఆదుకోవాలి



విలియమ్స్ హోవే చిత్రపటానికి నివాళులర్పించిన టైలర్లు

బోట్‌క్లబ్: ప్రస్తుతం రెడీమేడ్ దుస్తుల వల్ల ఉపాధి కోల్పోయి ఇబ్బందులు పడుతున్న టైలర్లను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఏపీ టైలర్స్ కో– ఆపరేటివ్ సొసైటీ పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి బిఎస్ఎస్ఎన్ సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక జగన్నాథపురంలో శుక్రవారం టైలర్స్ డే సందర్భంగా టైలరింగ్ మెషీన్ కనుగొన్న విలియమ్స్ హోవే చిత్ర పటానికి పూల మాలలు వేశారు. నగరంలో ఎంతో మంది ఈ వృత్తిపై ఆధారపడి ఉన్నారన్నారు. వీరిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సీనియర్ టైలర్ ఆంజనేయులు దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో టైలర్స్ సొసైటీ పరిరక్షణ కమిటీ సహాయ కార్యదర్శి నేమాల ప్రసాద్, సభ్యులు అప్పారావు పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్ స్విమ్మింగ్ పోటీలకు నాగకృష్ణ



నాగకృష్ణతో డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్ తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): గుజరాత్ రాష్ట్రంలోని గాంధీనగర్‌లో ఈ నెల 5 నుంచి 7 వరకు జరిగే ఆలిండియా సివిల్ సర్వీస్ స్విమ్మింగ్ పోటీలకు స్థానిక క్రీడా మైదానంలో స్విమ్మింగ్‌లో సాధన చేస్తున్న కొయ్య నాగకృష్ణ హాజరవుతున్నారని డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ శుక్రవారం తెలిపారు. డీఎస్ఏ స్విమ్మింగ్ కోచ్ అప్పల నాయుడు వద్ద శిక్షణ పొందుతున్న నాగకృష్ణ 50, 100, 200 మీటర్ల విభాగంలో జరిగే పోటీల్లో పాల్గొంటున్నాడని పేర్కొన్నారు.

అన్ని రంగాలకు కేటాయింపులు



బీజేపీ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరావు

బోట్‌క్లబ్: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్ని రంగాలకు ప్రాధాన్యం ఇచ్చిందని బీజేపీ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు అన్నారు. స్థానిక రామారావుపేటలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైద్యం, విద్య, పంచాయతీ రాజ్, పట్టాణాభివృద్ధి, ఇరిగేషన్, వ్యవసాయం వంటి రంగాలకు అధిక మొత్తంలో నిధులు కేటాయించిందన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అధిక మొత్తంలో నిధులు కేటాయించడం గొప్ప విషయమన్నారు. తెలుగు భాషా అభివృద్ధికి నిధులు కేటాయించడం ఆహ్వానించదగ్గ విషయమని ఆయన అన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కరప: మండలం ఉప్పలంక శివారున లలిత గొడౌన్స్ వెనుక సర్వే తోటలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సర్వే తోటలో మృతదేహం ఉందన్న సమాచారంతో ఎస్‌ఐ టి.సునీత సిబ్బందితో వెళ్లారు. మృతుడి వయసు 35 నుంచి 45 ఏళ్ల మధ్య ఉంటుందని, పచ్చరంగు టీషర్ట్, నలుపురంగు షార్టు ధరించి ఉన్నాడు. మృతదేహం పాడై ఉందని, నాలుగైదు రోజుల క్రితం చనిపోయినట్లుగా ఉందన్నారు. మృతదేహాన్ని కాకినాడ ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. అతడి గురించి సమాచారం తెలిస్తే కాకినాడ రూరల్ సీఐ 94407 96521, కరప ఎస్‌ఐ– 94407 96557, కరప స్టేషన్ ల్యాండ్‌నంబరు 0884 2394833 లకు ఫోన్‌చేయాలన్నారు.

భువనేశ్వరి పీఠంలో పూజలు

పెద్దాపురం: స్థానిక వర్జులవారి వీధిలోని భువనేశ్వరి పీఠంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి శ్రీ చింతా గోపిశర్మ సిద్ధాంతి జన్మదిన వేడుకల్లో భాగంగా భక్తులు అమ్మవారికి పూజలు నిర్వహించి ఆయనను సతీసమేతంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పురం వెంకటరత్నం, పాలకుర్తి సతీష్, చార హనుమాన్‌శర్మ, రాముశర్మ తదితరులతో పాటు, భక్తులు పాల్గొన్నారు.

బాబూ రాజేంద్ర ప్రసాద్‌కు ఘన నివాళి

కాకినాడ రూరల్: దేశ తొలి రాష్ట్రపతి బాబు రాజేంద్రప్రసాద్ వర్ధంతిని పురస్కరించుకుని రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ సైనిక ఉద్యోగి ఎస్.శ్రీనగేష్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరంలో ఆయన చేసిన సేవలను వివరించారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, ప్రసాద్ నాయుడు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, రాజా, రవిశంకర్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రెడీమేడ్ వస్త్రాలతో దర్జీల ఉపాధికి గండి

రెడీమేడ్ దుస్తులతో దర్జీల ఉపాధికి గండి పడిందని దర్జీ అల్లం రాజా పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో శుక్రవారం దర్జీ దినోత్సవం సందర్భంగా రాజాను సత్కరించారు. ఈ వృత్తినే నమ్ముకుని బతుకున్న దర్జీలను ఆదుకునేందుకు ప్రభుత్వం బ్యాంక్ రుణలు ఇప్పించడంతో పాటు విద్యుత్ రాయితీ ఇవ్వాలని, 50 ఏళ్లు పైబడిన దర్జీలకు పింఛన్ సదుపాయం కల్పించాలన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, ప్రసాద్ నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం



గురజనాపల్లి హైస్కూలులో సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కరప: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్ సీవీ రామన్‌కు ఘన నివాళులు అర్పించారు. గురజనాపల్లిలోని పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నతపాఠశాలలో హెచ్‌ఎం ఎ.సాయిమోహన్ సైన్స్ ప్రదర్శనను ప్రారంభించి విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. భౌతికశాస్త్ర పరికరాలు, జీవశాస్త్ర అంశాలపై రంగవల్లుల పోటీలు నిర్వహించి విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. సైన్స్ ఉపాధ్యాయులు ఎం.ప్రభారాణి, పీజీఎస్ భవానీ, వీవీ రమణమూర్తి, వి.శోభాకర్‌లను హెచ్‌ఎం సత్కరించారు. స్థానిక హైస్కూలులోఉపాధ్యాయులతో కల్సి హెచ్‌ఎం ఎం.శ్రీనివాస్ సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు ఎల్.సత్యనారాయణ, ఎస్.ప్రసాద్‌కుమార్, టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



గురజనాపల్లిలో సీవీ రామన్, సైన్స్ పరికరాలతో రంగవల్లులు వేసిన విద్యార్థినులు

క్లబ్ ఫుట్ సేవల పర్యవేక్షణ

- జీజీహెచ్‌ను సందర్శించిన క్యూర్ ఇండియా ప్రతినిధి బ్రూస్



వైద్యులు, బాధిత చిన్నారుల తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ బ్రూస్

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్‌లో క్లబ్ ఫుట్ (చిన్నపిల్లల్లో వంకర పాదాలు) సేవలను క్యూర్ ఇండియా సంస్థ ప్రతినిధి, అమెరికాకు చెందిన డాక్టర్ బ్రూస్ స్మిత్ శుక్రవారం పర్యవేక్షించారు. ఈ మేరకు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, డిప్యూటీ సూపరింటెండెంట్, ఆర్థోపెడిక్స్ హెచ్‌వోడీ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ ఆధ్వర్యంలో ఆర్థోపెడిక్స్ విభాగంలో బాధిత బాలల తల్లిదండ్రులతో స్మిత్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జీజీహెచ్‌లో అందుతున్న సేవల నాణ్యత, ప్రయోజనాలపై ఆయన ఆరా తీశారు. డాక్టర్ విఠల్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వైద్య సేవలను బాలల తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తం చేశారు. డాక్టర్ విఠల్ మాట్లాడుతూ గడచిన ఏడేళ్లుగా క్యూర్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో వేలాది చిన్నారులకు పునర్జన్మనిచ్చామన్నారు. జీజీహెచ్‌లో అప్పుడే పుట్టిన పిల్లల నుంచి ఐదేళ్ల వయసు చిన్నారుల వరకు వంకర పాదాలు సరిచేసే వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్థోపెడిక్ ప్రొఫెసర్లు డాక్టర్ పార్థసారథి, డాక్టర్ ముఖర్జీ, పీజీ వైద్యులు, హౌస్ సర్జన్స్, క్యూర్ ఇండియా స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ శిరీష, జిల్లా ప్రోగ్రాం సమన్వయకర్త కిరణ్‌రాయ్ తదితరులు పాల్గొన్నారు.